క్లుప్తంగా

శివాలయంలో రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ : మాస శివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి కి రుద్రాభిషేకం చేశారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జాతీయ ఉపకార వేతనాలకు ముగ్గురు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం సురేంద్రనాథరెడ్డి

పీలేరు రూరల్ : జాతీయ ఉపకార వేతనాలకు స్థానిక మెయిన్ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేంద్రనాథరెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన పి.ముస్కాన్, పి.జుబేర్‌ఖాన్, ఎస్.తహసీన్ ఎంపికైనట్లు తెలిపారు. ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ. 48 వేలు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫ్యారూఖాన్, ఎం. శ్రీరాములు, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ నుంచి ఇందుకూరి ధీరజ్..


ఇందుకూరి ధీరజ్

పెద్దతిప్పసముద్రం : స్థానిక మోడల్ స్కూల్‌లో 8వ తరగతి పూర్తి చేసిన ఇందుకూరి ధీరజ్ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఎంఈఓ నారాయణ, ప్రిన్సిపాల్ శివకుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జోగివారిపల్లికి చెందిన విద్యార్థి ఇటీవల నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష రాయగా 89 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ప్రభుత్వం ద్వారా ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతం మంజూరవుతుందని తెలిపారు.

కలకడ నుంచి 8 మంది ..

కలకడ : కలకడ ఆదర్శ పాఠశాల నుంచి జాతీయ ఉపకార వేతనాలకు 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లి తెలిపారు. 2023-2024 విద్యా సంవత్సరానికి ఆదర్శ పాఠశాల నుంచి 15మంది పరీక్షకు హాజరు కాగా 8 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి ప్రతి ఏడాది రూ.12వేలు చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు.

అసౌకర్యంగా ఏటీఎంలు



పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఏటీఎం అద్దాలు పగిలిపోయిన దృశ్యం

పీలేరు : ప్రజలకు ఎనీ టైం మనీ అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఏటీఎంలు వినియోగదారులకు తీవ్ర అసౌకర్యంగా ఉండడంతో పాటు ఎలాంటి భద్రత లేదు. పీలేరు పట్టణంలో వివిధ బ్యాంకులకు సంబంధించి సుమారు పదిహేను ఏటీఎంలు ఉన్నాయి. మెయింటెనెన్స్ లోపంతో ఏ ఏటీఎం చూసినా బూజు పట్టి, చెత్తాచెదారం పేరుకుపోయి అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నారు. ఎక్కడా ఏసీలు పని చేయక అలంకార ప్రాయంగా ఉన్నాయి. మరోవైపు ఏటీఎం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కూడా పని చేయడం లేదు. కొన్ని ఏటీఎంలకు డోర్లు పగిలిపోయి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎం నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

పంటల మార్పిడితో భూసారం పెంపు


కొత్తపల్లెలో సాగు చేసిన జొన్న పంట


మొరంపల్లెలో సాగు చేసిన రాగిపంట

గుర్రంకొండ : ఏడాదిలో ప్రతిసారీ ఒకేరకం పంటను సాగు చేయడం వలన భూసారం తగ్గడంతో పాటు ఎన్నో చీడపీడలు పంటలను ఆవహించడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఏడాదిలో రెండు నుంచి మూడు రకాల పంటల సాగు మార్పిడి పద్ధతి అవలంబించడం వలన రైతులకు ఆధిక దిగుబడులతో పాటు లాభాలు వచ్చే అవకాశముంది. వ్యవసాయాధికారుల సూచనలతో రైతులు ఇప్పుడిప్పుడే వాస్తవాలను గ్రహించి పంటమార్పిడి సాగు పద్ధతిని అలవాటు చేసుకొంటూ భూసారాన్ని పెంపొందించుకొంటున్నారు.

ఒకే రకం పంట సాగుతో నష్టాలు

జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు టమాటా పంటను ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఎంతటి సారవంతమైన పొలాల్లో అయినా ఏడాది పొడవునా ఒకే రకం పంట సాగును చేపట్టడం వలన రైతులకు నష్టాలే మిగులుతాయి. అయితే కొందరు రైతులు పంటసాగు కాలం ముగిసిన తరువాత రెండు నుంచి మూడు నెలలు విరామం ఇచ్చి అదే నేలలో మళ్లీ గతంలో సాగు చేసిన రకం పంటనేసాగు చేస్తుంటారు. దీంతో ఎంత నాణ్యత కలిగిన నేలలోనైనా పంటదిగుబడి తగ్గడంతో పాటురోగాలు, చీడపీడలు ఎక్కువై రైతులు నష్టపోతున్నారు. దీంతో భూమిలో భుసారం తగ్గడం ద్వారా రైతులకు నష్టాలే తప్ప ప్రయోజనం కనిపించడం లేదు.

మారుతున్న ఆలోచనా విధానం

ఒకే రకం పంట సాగుతో నష్టాలు చవిచూస్తున్న రైతుల ఆలోచనా విధానం మారుతోంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు ఇప్పుడిప్పుడు తమ ఆలోచనాధోరణిని మార్చుకొంటున్నారు. ప్రధానంగా పంట మార్పిడి చేసే ముందు అంతకు ముందు రైతులు గతంలో వేసిన ప్రధాన పంటకు భిన్నంగా పెరిగే పైరును ఎంచుకోవాల్సి ఉంటుంది. భూమికి సత్తువ, పోషకాలను ఇచ్చే పైరులను ఎంచుకోవడం ఎంతో లాభదాయకంగా ఉంటుంది. ఈ పద్ధతి వలన పైరులు ఆకులు రాల్చి,భూమికి సేంద్రీయ పదార్థాలను అందజేస్తాయి. సూక్ష్మజీవుల చర్య ఫలితంగా ఎంజైయములు ఉత్పత్తి అవుతాయి. విభిన్న పంటల సాగుతో పైరుకు కొంత మేరకు నత్రజని ఎరువు లభిస్తుంది. కంది, శెనగ పైర్లు వరుసగా వేస్తే కాయతొలుచు పురుగులు తాకిడి అధికంగా ఉంటుంది. అదే జొన్న, సజ్జ, రాగి, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ వంటి పంటల సాగుతో పంట మార్పిడి చేసుకోవడం వలన రైతులకు ఎంతో లాభముంటుందని వ్యవసాయాధికారులు అంటున్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగు

ఏడాది పొడవునా ఒకే రకం పంటల సాగు విధానానికి స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం వలన రైతులు మంచి ఫలితాలు సాధించవచ్చు. వరుసగా టమాటా సాగు చేసే రైతులు ఆవాలు, బంతి, ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులిపురుగుల ఉధృతి తగ్గుతుంది. వరితో పంట మార్పిడి చేయడం ద్వారా వేరుశెనగ పైరుకు నులి పురుగుల బెడద ఉండదు. వంగతోటలు సాగు చేసేవారు క్యాలీఫ్లవర్ సాగు చేయడం ద్వారా వంగకు ఎండు తెగులు సోకదన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు చేయడం వలన పొలంలో భూసారం పెంపొందుతుంది. భూసారం పెరగడం వలన పంట సాగులో చీడపీడల బాధ కొంతవరకు అరికట్టవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తప్పనిసరిగా పంటమార్పిడిసాగు ను అనుసరిస్తే మంచి ఫలితాలతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

పెరుగుతున్న టమాటా ధరలు


మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ : టమటా ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. ధరలు పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె మార్కెట్‌కు గత రెండు నెలలు నుంచి టమటాలు వస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడులు తక్కువ. ధరలు పుంజుకుంటున్న సమయంలో దిగబడులు తగ్గాయి. పెరుగుతున్న ధరలు చూసి రైతులు టమటా సాగుపై మొగ్గు చూపుతున్నారు. మదనపల్లె మార్కెట్‌లో మంగళవారం మొదటి రకం 10 కిలోలు రూ. 660 పలికింది. రెండో రకం 10 కిలోలు రూ.520 పలికింది. 349 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. గత వారం రోజుల నుంచి ధరలు చూస్తే ధరలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. ధరలు ఇంకా పెరుగుతాయని వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.

వారం రోజులుగా టమటా ధరల వివరాలు

తేదీ	మొదటి రకం (పది కిలోలు)	రెండో రకం
31.5.2024	రూ.360	రూ.278
1.6.2024	రూ.380	రూ.298
2.6.2024	రూ.440	రూ.320
3.6.2024	రూ. 500	రూ.390
4.6.2024	రూ.660	రూ.520

గ్రంథాలయం పక్కనే చెత్తాచెదారం


గ్రంథాలయం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

పీలేరు : స్థానిక గ్రంథాలయం సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఈ దుర్గంధం భరించలేము బాబోయ్ అంటూ స్థానికులు, గ్రంథాలయానికి వచ్చే పాఠకులు వాపోతున్నారు. గ్రంథాలయం పక్కనే చెత్తాచెదారం, కుళ్లిన వ్యర్థ పదార్థాలు కుప్పలు కుప్పలుగా ఉండడంతో దర్గంధం వెదజల్లుతోంది. అయితే స్థానిక పంచాయతీ అధికారులు, సిబ్బంది ఇటువైపు చూడడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ

నంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె హెల్త్ క్లినిక్, దేవపట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి కొండయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నారాయణరెడ్డిపల్లిలో తనిఖీ చేసి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై ఆరాతీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

లక్కిరెడ్డిపల్లె : ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని లక్కిరెడ్డిపల్లె సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం లక్కిరెడ్డిపల్లి-1 అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితే ప్రకృతి సహకరించి వర్షాలు కురిసి కరువును నియంత్రించవచ్చన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లోను పెరటిలో కూరగాయల మొక్కలు నాటాలన్నారు. పెరట్లో పండించిన కూరగాయలతో పిల్లలకు మంచి పౌష్టికాహారం, ఆకుకూరలు అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం ప్రతి పిల్లవాడికి అందేటట్లు చూడాలన్నారు. ప్లాస్టిక్ వాడటాన్ని నిషేధించాలన్నారు. జూట్ బ్యాగ్‌లను వాడాలని తెలియజేశారు. రాబోయే తరాలకు మంచి పర్యావరణాన్ని అందిద్దామని చెప్పారు. అనంతరం వారు పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

సిద్దవటం : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్దవటం కోర్టు బార్ ప్రెసిడెంటు బి.వెంకటరత్నం అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సిద్దవటం రేంజర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అవరణలో ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బార్ ప్రెసిడెంటు వెంకటరత్నం మాట్లాడుతూ కాలుష్యాన్ని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. భావితరాల వారికి మంచి పర్యావరణాన్ని అందిచాలన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవడం బాధ్యత



మాట్లాడుతున్న డాక్టర్ ఫైరోజా బేగం


అవగాహన కల్పిస్తున్న జేవీవీ అధ్యక్షులు ప్రభుచరణ్

డాక్టర్ ఫైరోజా బేగం

వాల్మీకిపురం : కాలుష్యాన్ని నివారిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవకోటికి ఆధారమైన పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడం ద్వారానే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించగలుగుతామన్నారు. అడవులు, జలవనరులు క్రమేపి తగ్గిపోతున్నాయని, ఈరకంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సాధించిన పురోగతి కూడా ప్రకృతి కాలుష్యానికి కారణమవుతోందన్నారు. మొక్కలు నాటడం, సైక్లింగ్ చేయడం, ప్లాస్టిక్‌కి దూరంగా ఉండటం ద్వారా మనవంతు బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. రవాణా, పరిశ్రమలు, వ్యర్థాలు ఇవన్నీ గాలి నాణ్యతపై ప్రభావం చూపిస్తాయన్నారు. పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు మొక్కలు నాటాలన్నారు. అలాగే స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేసి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శివాని, సోని, కిషోర్, సిబ్బంది బాబాఫకృద్దీన్, మురళి, గోవిందమ్మ, కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ శ్రీదేవి, అధ్యాపకులు బాలగంగాధర్ తిలక్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేష్, జాకబ్ రవికుమార్, జాన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మదనపల్లె సిటీ : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. బుధవారం చిత్తూరు రోడ్డులోని కాలేజీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణ మార్పులు దృష్టిలో పెట్టుకుని పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. చెట్లని సంరక్షించడం, నీటిని సంరక్షించడం వంటి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.అరుణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక చలపతిరావునగర్, టీఎస్ఆర్ కాలనీ, వడ్డిపల్లెల్లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని క్రై, ఫోర్డు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వివిధ విభాగాల్లో డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రామలింగారెడ్డి


వడ్డిపల్లెలో విద్యార్థుల ర్యాలీ

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- భూకబ్జాలపై ఉక్కుపాదం
- నియోజకవర్గ అభివృద్ధి దిశగా అడుగులు

మదనపల్లె : నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి, అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళతానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ.. తన మీద నమ్మకం ఉంచి, ఎమ్మెల్యేగా ఎన్నుకున్న నియోజకవర్గ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటమే కాకుండా, అందరినీ సొంత కుటుంబ సభ్యులుగా భావించడం తన గెలుపునకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. మదనపల్లెలో ఇటీవల కాలంలో భూకబ్జాలు, ఆక్రమణలు, అరాచకాలు అధికమయ్యాయని, వీటన్నింటిపై దృష్టిసారించి అరికడతానన్నారు. గంజాయి, మత్తుపదార్థాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయని, పోలీసుల సహాయంతో వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ప్రశాంత జీవనానికి ఎవరు భంగం కలిగించినా, సహించేది లేదన్నారు. సమావేశంలో భాగంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన షాజహాన్‌బాషాను బీజేపీ రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, ఆకులకృష్ణమూర్తిలు పార్టీ నాయకులు కృష్ణయ్యవర్మ, కోసూరి భవానీ తదితరులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన శ్రీరామ రామాంజనేయులు, సంగం శీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

మాజీ ఎమ్మెల్యే చింతల


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తామని పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఓట్లు వేసిన పీలేరు నియోజకవర్గ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గంలో ఎన్నో సంక్షేమ పథకాలు అందించామన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీలు కూడా అభివృద్ధిని కొనసాగించాలన్నారు. వేలకోట్ల రూపాయలు డీబీటీ ద్వారా అర్హత కల్గిన పేదలకు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అవ్వా, తాతలు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు ఇచ్చామని, రైతులకు భరోసా ఇస్తూ సంక్షేమం అందించామని, అమ్మ ఒడి, విద్యా దీవెన అందిస్తూ ముందుడగు వేసినా ఈ ఫలితాలు వస్తాయని ఊహించలేదన్నారు. నియోజకవర్గంలో ప్రతి నాయకుడు, కార్యకర్తలు తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామన్నారు.

శిశు సంరక్షణ తల్లి బాధ్యత


ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

కలకడ : చంటిబిడ్డ అనారోగ్యాలను మొదటి గుర్తించేది తల్లే అని, ఆ నైపుణ్యం ఎంతో అవసరమని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని కదిరాయచెర్వు పంచాయతీలో 104 వాహనం ద్వారా ఉచిత వైద్య సేవలను అందించారు. వర్షాకాలం కారణంగా జలుబు, దగ్గు, జ్వరం, నీరసం, శ్వాసకోశ వ్యాధులకు, శరీరంపై గుల్లలు రావడం వంటివి జరుగుతాయన్నారు. తల్లి బిడ్డను ప్రసవించిన అరగంటలోపు బిడ్డకు అందించే ముర్రుపాలలో అధిక వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, ఆరు మాసాలపాటు విధిగా బిడ్డకు తల్లిపాలు అందించాలని కోరారు. ఆహారం తీసుకునే ముందు చేతుల పరిశుభ్రత ముఖ్యమని చేసి చూపించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్న ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధికి చెక్


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీవిద్య

వాల్మీకిపురం : క్షయ వ్యాధి లేని సమాజ నిర్మాణ లక్ష్య సాధన కోసం వయోజన బీసీజీ టీకాలు ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. బుధవారం మండలంలోని విఠలం, బోయపల్లి గ్రామాల్లో ప్రజలకు బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వయోజన టీకా చాలా సురక్షితమైందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మదర్ రఫీ, సూపర్‌వైజర్లు సుధాకర్, సిబ్బంది రెడ్డెమ్మ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

తొలిదశలో కేన్సర్‌ను గుర్తిస్తే జయించడం సులువు

- అందుబాటులో ఆధునాతన వైద్యం
- నివారణ చర్యలపై విస్తృతంగా అవగాహన

మదనపల్లె : కేన్సర్ అనగానే అందరూ భయంతో వణికిపోతారు. ఈ వ్యాధి సోకితే ఇక తనువు చాలించాల్సిందే అని భయాందోళనకు గురవుతారు. అయితే ప్రస్తుతం కేన్సర్‌కు అధునాతనమైన వైద్యం, చికిత్స, మందులు అందుబాటులోకి వచ్చాయి. కేన్సర్ వ్యాధి భారినపడ్డ వారు ఎవరూ ఆందోళన చెందకుండా వైద్యం చేయించుకుంటే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక సర్వజన ఆసుపత్రుల్లో కేన్సర్‌కు వైద్యం అందుబాటులో ఉంది. ప్రాణాంతకరమైన వ్యాధి అయినప్పటికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్యం, ఆత్మవిశ్వాసంతో కేన్సర్‌ను జయించవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. కేన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందంటున్నారు.

కేన్సర్‌ను గుర్తించడం ఎలా?

శరీరంలో అదుపులేకుండా పెరిగే కణజాలమే కేన్సర్. ప్రస్తుతం మనిషి జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల కారణంగానే కేన్సర్ వ్యాప్తి తీవ్రమవుతుంది. పొగతాగడం, మద్యం సేవించడం, అధికబరువు, వయస్సు పెరుగుదల, వంశపారంపర్యంగా, కొన్ని వైరస్‌ల కారణంగా మనిషి కేన్సర్ వ్యాధి భారీ పడుతున్నారు.

లక్షణాలు ఇలా..

ఎలాంటి కారణం లేకుండా బరువు తగ్గడం, ఆకలి లేక పోవడం, అధికరక్తస్రావం, శరీరంలో గడ్డలు, ఎక్కువ రోజులుగా మలబద్ధకంగా ఉండటం, మూత్ర విసర్జన సమయంలో రక్తంపడటం అలాగే నోటిలో పుండ్లు వచ్చి వైద్యం చేయించుకున్నప్పటికి తగ్గకుంటే కేన్సర్ లక్షణాలుగా గుర్తించి వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.

మూడు రకాల్లో వైద్యం

కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయమవుతుంది. కీమో, రేడియో థెరఫీ, శస్త్ర చికిత్సల ద్వారా వైద్యం చేస్తారు. కీమో థెరఫీ అంటే. మందులు, సూదుల ద్వారా వైద్యం చేస్తారు. రేడియో థెరఫీ అంటే ప్రత్యేకమైన మిషన్ల ద్వారా క్యాన్సర్ సోకిన భాగానికి వైద్యం చేసి క్యాన్సర్‌ను నయం చేస్తారు. శస్త్ర చికిత్సతో కేన్సర్ సోకిన భాగాన్ని తొలగించి తద్వారా నయం చేయవచ్చు. .

కేన్సర్ సోకకుండా ఉండాలంటే..

సమతుల్య ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని నడక, వ్యాయామం. మద్యం, పొగతాగడం వంటి వాటికి దూరంగా ఉండటం, కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా కేన్సర్ వ్యాధి ఉండివుంటే ఆ కుటుంబంలోని సభ్యులు డాక్టర్‌ను సంప్రదించి సలహా పొందితే కేన్సర్ వ్యాధి భారీన పడకుండా ఉండవచ్చు.

సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి...

యాభై సంవత్సరాలు పైబడ్డ మహిళలు రొమ్ము కేన్సర్‌కు సంబంధించిన టెస్ట్‌లను ఏడాదికి ఒకమారైనా చేయించుకోవాలి. 21 సంవత్సరాలు పైబడిన వారు మూడు సంవత్సరాలకు ఒకసారి గర్భాశ ముఖద్వారా పరీక్షలు చేయించుకోవాలి. నలభై సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలు పేగుకు సంబంధించిన పరీక్షలను చేయించుకోవాలి. ఇలా చేయడం వల్ల కేన్సర్ సోకి ఉంటే వెంటనే గుర్తించి వైద్యం పొందేందుకు వీలవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆందోళన వీడి ఆత్మవిశ్వాసంతో వైద్య పరీక్షిలు చేయించుకోవాలి.

ఆకేపాటి అమరనాథరెడ్డికి శుభాకాంక్షలు


నందలూరు: ఆకేపాటిని సత్కరిస్తున్న ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు : రాజంపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆకేపాటి అమరనాథరెడ్డికి బుధవారం ఆకేపాటి ఎస్టేట్‌లో రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, నందలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆకేపాటికి శాలువా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ గాలివీటి

వీరబల్లె : రాష్ట్ర సార్వత్రిక ఎన్నికలలో రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన ఆకేపాటి అమరనాథరెడ్డిని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, ఆయతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిణామలపై చర్చించారు. తనను గెలిపించిన ప్రజలకు ఆకేపాటి కృతజ్ఞతలు తెలిపారు.